# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




వరంగల్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 220 పేజీలు : 04 వెల రూ. 2 మంగళవారం 03 - 03 - 2026


## తెలంగాణ కాంగ్రెస్ నేతలతో రాహుల్ గాంధీ సమావేశం

- డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరంలో పాల్గొని దిశానిర్దేశం
- తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలపై ప్రధానంగా చర్చ
- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు.. రేసులో పలువురు సీనియర్ నేతలు
- రెండు సీట్లు గెలుచుకోవడంపై ధీమాతో ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పీఏసీల సంయుక్త భేటీకి రాహుల్ గాంధీ
- తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల ఎన్నికలపై రాహుల్ గాంధీ రాష్ట్ర నాయకత్వంతో చర్చించారు
- ఈ నెల 16న ఎన్నికలు జరగనుండగా, నామినేషన్ల దాఖలుకు 5 చివరి తేదీ



**హైదరాబాద్ :**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ ఇవాళ తెలంగాణలో పర్యటించారు. తెలంగాణ, ఏపీ కాంగ్రెస్ పార్టీల రాజకీయ వ్యవహారాల కమిటీల (పీఏసీ) సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వికారాబాద్‌లోని ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఈ సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత బలోపేతం, ముఖ్యంగా తెలంగాణలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలపై ఈ పర్యటనలో ప్రధానంగా చర్చలు జరిగాయి.ఇవాళ ఉదయం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కలిసి శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి ఘన - మిగతా 2 లో

## పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో పడగొడతాం



- కాంగ్రెస్ సర్కార్‌కు బండి సంజయ్ వార్నింగ్
- గాంధీ విగ్రహం పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారన్న బండి సంజయ్
- తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను కూల్చివేస్తామని హెచ్చరిక
- మూటల కోసమే రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చారని విమర్శ

**హైదరాబాద్ :**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పేదల ఇళ్లను కూల్చివేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం - మిగతా 2 లో

## 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యా



- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తన మీద కేసులు పెట్టారని, కోర్టుకు వెళ్లారని గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి
- రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యమని వ్యాఖ్య

**హైదరాబాద్ :**

తాను 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ఏపీసీసీ - మిగతా 2 లో



2 లో

## అమెరికా యుద్ధ విమానాలపై కువైట్ 'ఫ్రెండ్లీ ఫైర్'

- ఆ మూడు యుద్ధ విమానాలను కువైట్ పొరపాటున కూల్చింది: అమెరికా ప్రకటన
- కువైట్ గగనతలంలో పొరపాటున అమెరికా విమానాల కూల్చివేత
- ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో పాల్గొన్న మూడు ఎఫ్-15 విమానాలు ధ్వంసం
- ఇరాన్ దాడుల సమయంలో శత్రువులుగా భావించి కాల్పులు
- ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ ఆరుగురు సిబ్బంది

## ఇరాన్ దాడిని ఖండించిన ప్రధాని నరేంద్ర మోదీ



- గల్ఫ్ దేశాల అధినేతలకు మోదీ ఫోన్
- సౌదీ అరేబియా యువరాజుతో ఫోన్లో మాట్లాడిన మోదీ
- బహ్రెయిన్ రాజు ఖలీఫాతో భారతీయుల భద్రతపై చర్చించిన ప్రధాని
- సౌదీ, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడిని ఖండించిన మోదీ

**ఢిల్లీ :**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గల్ఫ్ దేశాల అధినేతలతో అక్కడి భారతీయుల భద్రతపై చర్చలు - మిగతా 2 లో


## భారత్, కెనడా కూడా కలిసి భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటాయి

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- టీ20 ప్రపంచకప్‌లో కెనడా ఆడటం సంతోషం కలిగించింది
- భారత్-కెనడా సీఈవోల ఫోరమ్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- టీ20 మ్యాచ్‌లా ఇరు దేశాల బంధం ముందుకు సాగాలని ఆకాంక్ష
- కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన మోదీ
- 2023లో ఖలిస్తానీ వేర్పాటువాద కార్యకలాపాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునే దిశగా ఇరువురు నేతలు చర్చలు



**ఢిల్లీ :**

ప్రధాని నరేంద్ర మోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ న్యూఢిల్లీలో జరిగిన 'ఇండియా-కెనడా సీఈవోల ఫోరమ్'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఇరు దేశాల సంబంధాలను క్రికెట్‌తో పోల్చుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2023లో ఖలిస్తానీ వేర్పాటువాద కార్యకలాపాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకునే దిశగా ఇరువురు నేతలు చర్చలు జరిపారు.ఈ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "మీలో చాలామంది క్రికెట్‌ను గమనిస్తూనే ఉంటారు. భారత్ వేదికగా జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో కెనడా జట్టు ఆడటం మనందరికీ ఎంతో సంతోషాన్నిచ్చింది. టీ20 క్రికెట్‌లో వేగవంతమైన నిర్ణయాలు, భయంలేని స్ట్రోక్స్, మ్యాచ్ విన్నింగ్ పార్ట్‌నర్‌షిప్‌లు ఎలా ఉంటాయో.. అలాగే భారత్, కెనడా - మిగతా 2 లో






2 లో

## గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న ప్రవాసాంధ్రులను సురక్షితంగా తీసుకురావాలి

- వైసీపీ అధినేత జగన్
- యుద్ధ వాతావరణం కారణంగా వేలాది మంది ఆందోళన
- విమాన సర్వీసుల రద్దుతో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ప్రయాణికులు
- కేంద్రంతో సమన్వయం చేసుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచన
- బాధితుల కోసం కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేయాలి

## సిలిండర్ల డెలివరీలో డబ్బు వసూలు చేయొద్దు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- బస్టాండ్లలో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి
- ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ శాఖల సమర్థత పెరిగేలా, మెరుగైన సేవలు అందించేలా అధికారులకు పలు సూచనలు
- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలను సురక్షితంగా తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు
- దీపం పథకం గ్యాస్ డెలివరీకి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించుకోవడం ద్వారా పాలనలో సమర్థత మరింత పెంచుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు



**అమరావతి :**

పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలను సురక్షితంగా తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర దేశాల్లోని రాష్ట్ర ప్రజలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా అక్కడ చిక్కుకుపోయిన వారిని సంప్రదించి, తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం - మిగతా 2 లో

# పెన్షనర్లకు సత్వర సేవలు అందిస్తాం

**- జిల్లా ట్రెజరీ అధికారి ఎస్. మధు కుమార్**



**జగిత్యాల మార్చి 02 (ప్రజా మంటలు)::** పెన్షనర్లకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సత్వర సేవలు అందిస్తామని జగిత్యాల జిల్లా ట్రెజరీ అధికారి ఎస్. మధుకుమార్ అన్నారు. సోమవారం జిల్లా ట్రెజరీ అధికారిగా ఎస్. మధు కుమార్ పూర్తి ఆదనపు పదవీ భాద్యతలు స్వీకరించిన సందర్భంగా తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా, డివిజన్, మండలాల పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పుష్ప గుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ అధికారి మాట్లాడుతూ గతం లో టీఎన్జీవో, రెవిన్యూ ఉద్యోగుల నేతగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, ప్రస్తుతం పెన్షన ర్ల జిల్లా అధ్యక్షులుగా పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న హరి అశోక్ కుమార్ ను, వారి సంఘాల ప్రతినిధులను అభినందించారు. అనంతరం పెన్షనర్ల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గతంలో టీ ఎన్జివో నేతగా పని చేసిన మధు కుమార్ జిల్లా ట్రెజరీ అధికారిగా పదవీ భాద్యత లు స్వీకరించడం జిల్లా ట్రెజరీ ఉద్యోగులకు గొప్ప అండ అన్నారు.ఏ. టి. వో మయూరి,ఎస్. టి. వో. లు గణేష్, విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రవిలు ఉద్యోగులకు, పెన్షనర్ల కు విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్,ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు పూసాల అశోక్ రావు, నాయకులు ఎం. డి. యాకూబ్, ఎం. డి. వజీర్,పబ్బా శివానందం,సయ్యద్ యూసుఫ్, ఎం. డి. ఎక్బల్, రజాక్, గంగాధర్, కరుణ, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి



**మెదక్ మార్చ్ 02 (ప్రజా మంటలు):** మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని శ్రీపాదరావు సేవలను స్మరించారు.ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ, శ్రీపాదరావు సౌమ్య స్వభావం, సరళ జీవనశైలి కలిగిన నాయకుడిగా ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యుడయ్యాడని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా చేసుకుని ఆయన రాజకీయ జీవితం కొనసాగిందన్నారు.అసెంబ్లీ స్పీకర్గా పనిచేసిన సమయంలో చూపిన నిజాయితీ, నిరాడంబరత, నిష్పక్షపాత నిర్ణయాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలం చేకూర్చాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు గుర్తుండిపోతాయని తెలిపారు.ప్రజాసేవ ధ్యేయంగా సాగిన శ్రీపాదరావు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్సైలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సంఘం సభ్యుల పిల్లలకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ




**భీమదేవరపల్లి, మార్చి 1 (ప్రజా మంటలు)** :ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యుల పిల్లలకు ప్రోత్సాహక బహుమతుల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి చేతుల మీదుగా ఎంసెట్ – 2025 మొదటి సంవత్సరం విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. మెడిసిన్, డెంటల్, ఫార్మా–డి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.21,000/– చొప్పున, ఇంజనీరింగ్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్/హార్టికల్చర్/నర్సింగ్ విద్యార్థులకు రూ.16,000/– చొప్పున మొత్తం 90 మంది విద్యార్థులకు రూ.14,69,000/–ల ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై డాక్యుమెంటరీ, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యాభివృద్ధికి సంఘం కట్టుబడి ఉందని అధ్యక్షులు తెలిపారు. సంఘం ఈ ప్రోత్సాహక బహుమతి కార్యక్రమాన్ని 2008 లో ప్రారంభించగా, 2008 నుండి 2025 వరకు మొత్తం 1,458 మంది విద్యార్థులకు రూ.1,39,22,500/–ల మేర ఆర్థిక సహాయం అందజేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ యం. రాంరెడ్డి, ఉపాధ్యక్షులు గజ్జి వీరయ్య, కార్యవర్గ సభ్యులు ఈర్ల మూగయ్య, కంది రవిందర్ రెడ్డి, అంబాల రాములు, బేల కనుకమ్మ, చెవ్వల్ల బుచ్చయ్య, గుగ్లోతు బాషు, బొల్లపెల్లి వీరా రెడ్డి, కర్రె మహేందర్, మండ శ్రీనివాస్, బొల్లంపెల్లి కుమారస్వామి,కాశిరెడ్డి వసంత గనెవేన శ్రీనివాస్, గుర్రాల భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా దేవాలయ

**ద్వారబంధనం**



**భీమదేవరపల్లి, మార్చి 2 (ప్రజా మంటలు)** :కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయంలో మార్చి 03 మంగళవారం రోజున జరిగే సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఈవో కిషన్ రావు తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా ఆ రోజు ఉదయం ప్రాతఃకాల పూజలు ముగిసిన అనంతరం ఉదయం 7.00 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేయనున్నారు. తిరిగి అదే రోజు సాయంత్రం 7.00 గంటలకు దేవాలయ ద్వారాలను తెరిచి ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శుద్ధి అనంతరం శ్రీ స్వామివారి మరియు అమ్మవార్ల దర్శనాలు బుధవారం ఉదయం నుంచి యథావిధిగా భక్తులకు అందుబాటులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భక్తులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## విలేఖరి రమణారెడ్డికి నివాళులర్పించిన పాత్రికేయులు



**భీమదేవరపల్లి, మార్చి 02 (ప్రజా మంటలు)** :మండలానికి చెందిన సీనియర్ విలేఖరి రమణారెడ్డి మృతికి భీమదేవరపల్లి మండల పాత్రికేయులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు, స్నేహితులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రమణారెడ్డి గతంలో సుదీర్ఘకాలం ఆంధ్రప్రభ దినపత్రికలో విలేఖరిగా సేవలందిస్తూ, ప్రస్తుతం ప్రజాజ్యోతి పత్రికలో పనిచేస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు. తన జర్నలిస్టిక్ జీవితం మొత్తం ప్రజల పక్షాన నిలబడి, నిజాయితీతో వార్తలు రాసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా గ్రామీణ సమస్యలు, అభివృద్ధి అంశాలు, సామాజిక సమస్యలపై ఆయన రాసిన కథనాలు ప్రజాదరణ పొందాయి. పాత్రికేయులు ఆయన సేవలను స్మరించుకుంటూ, రమణారెడ్డి ఆకస్మిక మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. యువ విలేఖరులకు ఆయన ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తి ఇవ్వాలని దేవుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పత్రికల ప్రతినిధులు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. చివరగా రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు.

## సామాజిక సేవకు గుర్తింపు

**గోల్డెన్ నంది అవార్డ్ అందుకున్న - తిప్పారపు శ్రీనివాస్..**



**చిగురుమామిడి మార్చి 02 (ప్రజా మంటలు):** చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త , కంటి పరీక్ష నిపుణులు తిప్పారపు శ్రీనివాస్ ఉత్తమ ఆప్టోమెట్రిస్ట్ గోల్డెన్ నంది అవార్డు–2026ను మాజీ కార్మిక శాఖ మంత్రి, ప్రముఖ నటుడు బాబు మోహన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి అందించే ఈ పురస్కార వేడుకను ఆదివారం హైదరాబాద్లోని బిర్లా సైన్స్ మ్యూజియం భాస్కర ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.గత కొంత కాలం నుండి సామాజిక సేవాలు , ఉచిత కంటి ఆపరేషన్లు కార్యక్రమాలను గుర్తించి ఈ పుర స్కారానికి ఎంపిక చేశారు.

# ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు



**కరీంనగర్, మార్చి 2 (ప్రజా మంటలు):** మాజీ శాసనసభ స్పీకర్, అజాతశత్రువు దుద్దిళ్ల శ్రీపాదరావు గారి 89వ జయంతి వేడుకలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు.ముందుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం బస్టాండ్ కూడలి వద్ద ప్రభుత్వం తరపున ఆర్డీవో మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, పర్వత మల్లేశం, వరాల నర్సింగం, గుమ్మడి రాజ్ కుమార్ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అన్నదాన కార్యక్రమం ప్రారంభంఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ శాసనసభ స్పీకర్గా శ్రీపాదరావు ప్రజాసేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని, ప్రాంత భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ సేవలు అందించి అజాతశత్రువుగా అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు.ఆయన చూపిన సేవా మార్గం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమని అన్నారు.అలాగే, ఆయన మరణానంతరం ఆయన ఆశయాలను తనయుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కొనసాగిస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజల మన్ననలు పొందుతున్నారని ప్రశంసించారు.విస్తృతంగా నాయకుల పాల్గొనడంఈ కార్యక్రమంలో వెన్న రాజమల్లయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, టేల భూమయ్య, ఆకుల ఉదయ్, మంద నగేష్ ముదిరాజ్, మూల కృష్ణారెడ్డి, వంగల విద్యాసాగర్, విక్టర్, నాగుల సతీష్, చెర్ల పద్మ, పంజాల స్వామి గౌడ్, దిండుగాల మధు, మాదాసు శ్రీనివాస్, సత్తినేని శ్రీకాంత్, జ్యోతి రెడ్డి, రాచర్ల పద్మ, అబ్దుల్ భారీ, కుంభాల రాజ్ కుమార్, బషీరుద్దీన్, కాంపల్లి కీర్తి కుమార్, ఎర్ర శ్రీనివాస్, స్వప్న శ్రీ, ముక్క భాస్కర్, శ్రీరాముల రమేష్, దండు రవీందర్, సలీముద్దీన్, సిరికొండ శివప్రసాద్, జొన్నల రమేష్, కొట్టె ప్రభాకర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సుంకరిగణపతి, ఊరడి లత, ములకల కవిత, మార్కరాజు, ఫజల్, అందే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిని చదువుల నిలయంగా మార్చుతా

**ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ కళాశాల తీసుకు వస్తా**

**2026 - 27 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభం..**

**ధర్మపురిలో డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**





**గొల్లపల్లి (ధర్మపురి)మార్చ్ 02ప్రజా మంటలు** :ధర్మపురిని చదువుల నిలయంగా మార్చడానికి తనవంతుగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురికి మంజూరైన డిగ్రీ కళాశాల నూతన భవన స్థలాన్ని మంత్రి అధికారులతో కలిసి ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం పరిశీలించారుఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన ప్రకారం ధర్మపురికి డిగ్రీ కళాశాల తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్ మిత్రులైన రమేష్ ధర్మపురిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు సహ కరించారని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అడిగిన వెంటనే ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరు చేశారని మంత్రి తెలిపారు2026–27 విద్యా సంవత్సరం నుండి ధర్మపురిలో డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం నాలుగు కోర్సుల్లో 240 సీట్లు కేటాయించడం జరిగిందని మంత్రి అన్నారు. బీఏ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. నూతన డిగ్రీ కళాశాల తాత్కాలికం జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తామని, ఏడాదిలోకి పక్కా భవనం నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ కళాశాలలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని అడ్మిషన్లు పొందాలని మంత్రి కోరారు. గతంలో ఇంటర్ పూర్తయిన తర్వాత డిగ్రీ కళాశాల లేక దూరప్రాంతాలకు వెళ్లలేక చాలా మంది ఆడపిల్లలు ఇంటర్ తో చదువు నిలిపివేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏనాడు ప్రజల అవసరాలను గుర్తించలేదని, మేమే రాజులు, మేమే మం త్రులు అన్నాట్లు వ్యవహరించారని మంత్రి విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం డిగ్రీ కళాశాల తీసుకువచ్చా మని మిగిలిన బస్సు డిపో, రెవెన్యూ సబ్ డివిజన్ కార్యాలయం, సబ్ రిజిస్టర్ కార్యాలయం వంటి హామీలు త్వరలోనే అమలు చేస్తామని మంత్రి తెలిపారుప్రస్తుతం ధర్మపురి డిగ్రీ కళాశాలకు మంజూరు అయిన కోర్సులతో పాటు స్థానికంగా ఉన్న యువతకు విదేశాల్లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ఓరియంటల్ కోర్సుల అనుమతికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ధర్మపురి లో బీఈడీ, బీఫార్మసీ, లా కాలేజ్ లు తీసుకువచ్చి ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించి ధర్మపురిని చదువుల తల్లి నిలయంగా మార్చుతానని మంత్రి తెలిపారు.మున్సిపల్ ఎన్నికలు 15 వార్డులకు 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడంతో తమపై మరింత బాధ్యత పెరిగింది ని మంత్రి తెలిపారు. 2027 లో జరిగే గోదావరి పుష్కరాలకు ఇప్పటికే అధికారులు సుమారు రూ. 944 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారని మంత్రి తెలిపారు. పుష్కరాల సందర్భంగా పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి ధర్మపురిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారుఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి , వైస్ చైర్మన్ ఇందారపు రామన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దినేష్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలి

**స్థానిక సంస్థల్లో జనరల్ రిజర్వుడు స్థానాల్లో వారే పోటీ చేసేలా సవరణ చేయాలి**



**జగిత్యాల మార్చి 2 ( ప్రజా మంటలు)** :దేశంలోని ఓసి ల స్థితిగతులను అధ్యయనం చేసి అగ్రవర్ణాల్లోని పేదలను ఆదుకోవడానికి జాతీయ స్థాయిలో ఓసి కమిషన్ ఏర్పాటు చేయాలనీ ఓసి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్న లు డిమాండ్ చేశారు.సోమవారం జగిత్యాల దేవిశ్రీ గార్డెన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓసీ జేఏసీ నేతలు కిషన్ రెడ్డి, రాజన్న లు మాట్లాడుతూ ఓసిల్లో చాలా వరకు పేదలున్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని, గత 14 ఏళ్లుగా శాంతియుతంగా పోరాడుతున్నామని,కేంద్ర ప్రభుత్వం అలోచించి 10 శాతం ఈడబ్ల్యూఎస్ అగ్రవర్ణాలకోసం అమలుచేసిందన్నారు.రాష్ట్రంలో 21 శాతం ఓసిలున్నారని, మాకు రిజర్వేషన్ల ఫలాలు అందడం లేదన్నారు.దేశంలో అగ్రవర్ణాలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక అసమానతాలను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలనికిషన్ రెడ్డి,రాజన్నలు డిమాండ్ చేశారు.రాజకీయ పరంగా జనరల్ కేటగిరికి కేటాయించిన రిజర్వేషన్లలో కేవలం ఓసిలు మాత్రమే పోటీచేసేవిధంగా రాజ్యాంగ సవరణ చేయాలన్నారు.ఓసీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో గత నెల 23 న న్యూఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన మహా ధర్నా విజయవంతం అయిందని చెబుతూ దీంతో కేంద్రంపై ఒత్తిడి పెంచామని కిషన్ రెడ్డి, రాజన్న లు వివరించారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారిలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, నిబంధనల మేరకు సర్టిఫికెట్లు జరిచేయాలనీ రెవెన్యూ అధికారులకు వారు సూచించారు. ఆనాడు 10 ఏళ్ల కోసం అమలు చేసిన రిజర్వేషన్లు 75 ఏళ్ళు దాటినా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు స్వార్ధ రాజకీయాలకోసం పెంచుతు వస్తున్నాయని, దీంతో ఓసి లకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయరంగాన్ని ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేయాలనీ, ప్రభుత్వాలు ఈ దిశలో ఆలోచించాలన్నారు.ఈడబ్ల్యూఎస్ సరిఫికెట్ ఆదాయ పరిమితి 10 లక్షలకు పెంచుతూ ఐదేళ్ళ కాలపరిమితితో కూడిన సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు.రైతులకు ప్రమాద భీమా వయస్సును 70 ఏళ్లకు పెంచి ఇన్సూరెన్స్ వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని వారు సూచించారు.ఓసి వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకు ఓసి వర్గాల్లోని యువత,మహిళలు రైతులు, ఉద్యోగులు ముందుకు రావాలని కిషన్ రెడ్డి, రాజన్నలు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జగిత్యాల రెడ్డి జన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోప్పెర వెంకట్ రెడ్డి, ఓసీ నేతలు పుల్లూరి సత్యనారాయణ, దేవరశెట్టి జనార్దన్, బండారి చంద్రశేఖర్, సిరిసిల్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ముల్కనూర్ బాలికల వసతి గృహంలో నిర్లక్ష్యం






**భీమదేవరపల్లి మార్చి 2 (ప్రజా మంటలు)** :మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలో నిర్వాహకుల నిర్లక్ష్యం బయటపడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. వసతి గృహం ప్రాంగణంలో ఏర్పా టు చేసిన విద్యుత్ ఫ్యూజ్ బాక్స్లో లోపా లు తలెత్తినప్పుడు సిబ్బంది స్వయంగా సరిచేయకుండా, హాస్టల్ విద్యార్థినులతో నే పనులు చేయిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్కు సంబంధించిన పనులు అత్యంత ప్రమా దకరమైనవని, అలాంటి పనులను చిన్నా రులతో చేయించడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. వసతి గృహంలో వార్డెన్ ఉన్నట్టా లేనట్టా పరిస్థితి నెలకొనడంతో పర్యవేక్షణలో తీవ్ర లోపం స్పష్టమవుతోందని ఆరోపిస్తున్నారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని, అయితే ఇలాంటి సంఘటనలు వెలుగులోకి రావడం బాధాకరమని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. వసతి గృహంలో విద్యుత్ సదుపాయాలు సురక్షితంగా ఉన్నాయా లేదా అన్న విషయంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన మార్గదర్శకాలు జారీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థినుల ప్రాణాలకు ముప్పు కలిగించే నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వారు హెచ్చరిస్తున్నారు.

## పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణగా రిజర్వేషన్లు

**అసెంబ్లీలో తీర్మానం చేయాలి కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్ మార్చ్ 02 (ప్రజా మంటలు):** హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీల జనా భా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్టు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో వెల్లడైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు.సోమవారం బంజారాహిల్స్లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో సమావేశం జరిగింది. పెరిగిన జనాభా శాతానికి అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశంపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని కోరారు.ఎస్సీ వర్గీకరణ అమలు చేసే ప్రక్రియలో, కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణన పూర్తయ్యాక అధికారిక లెక్కలు ప్రకటించిన తర్వాత రిజర్వేషన్లు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఆ ప్రకటనకు అనుగుణంగా వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.ఎస్సీ ఉప కులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ రిజర్వేషన్లు దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రిజర్వేషన్ల పెంపు సహా ఉప కులాల సమస్యల పరిష్కారం కోసం జాగృతి దళిత సంఘాలతో కలిసి ఉద్యమిస్తుందని తెలిపారు.కొన్ని ఎస్సీ ఉప కులాలకు కుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో 20 ఎస్సీ ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనర్హుల విద్యాకమీషన్ విద్యావ్యవస్థను నందనం చేస్తుంది

**యాదగిరి శేఖర్ రావు**



**కరీంనగర్ మార్చ్ 02 (ప్రజా మంటలు):** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్ నివేదికపై ౧=ాహీూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యావ్యవస్థ భవిష్యత్తును నిర్ణయించే కమిషన్లో ఎడ్యుకేషన్లో పీహెచ్డీ చేసిన విద్యావేత్తలు, స్కూల్ లేదా యూనివర్సిటీ స్థాయిలో బోధించిన అనుభవం ఉన్న నిపుణులు లేకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శించారు. పరిపాలనా అనుభవం వేరు, విద్యా శాస్త్రం వేరు అని స్పష్టం చేస్తూ, సంబంధం లేని రంగాల వ్యక్తులతో కొత్త విద్యా విధానం రూపొందించడం అంటే లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని అన్నారు.గడిచిన రెండేళ్లుగా విద్యాశాఖను నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు అర్హతలేని కమిటీలతో కాలయాపన చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ అంశంపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించే నిర్ణయాలను వెంటనే ఆపి, అసలైన విద్యావేత్తలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, సబ్జెక్ట్ నిపుణులతో కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

## ఆక్స్ఫర్డ్ పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు...



**చిగురుమామిడి మార్చి 02 (ప్రజా మంటలు):** చిగురుమామిడి మండలశీ ఇందుర్తి గ్రామంలోని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అప్పాల సమ్మయ్య మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా. వసంత రుతువును ఆహ్వానిస్తూ ప్రతి సంవత్సరం హోలీ పండుగను భారతదేశం అంతట చాలా ఘనంగా జరుపుకుంటారు. ఇది రంగుల పండుగ దీని ముఖ్య ఉద్దేశం మానవుని జీవితంలో కష్టసుఖాలు ఉంటాయి. కష్టాలన్నీ తొలగి మానవుని జీవితశీ సుఖ సంతోషాలతో రంగుల మయం కావాలని కోరుకున్నారు. పిల్లలందరూ ప్రకృతిలో దొరికే సహజమైన రంగులనే వాడాలని ఆరోగ్యానికి హానికరమైనటువంటి కందెనలు. కెమికల్స్ వాడకూడదు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చీఫ్ మినిస్టర్ కప్ ఖో ఖో పోటీలలో రాష్ట్ర స్థాయి లో


**రాణించిన విద్యార్థులను సన్మానించిన గ్రామ సర్పంచ్**




**మెట్టుపల్లి మార్చ్ 2( ప్రజా మంటలు దగ్గుల అశోక్ ):**చీఫ్ మినిస్టర్ కప్ రాష్ట్ర స్థాయి "ఖో ఖో "పోటీలలో ఫిబ్రవరి 23న నల్గొండ లో జరిగిన పోటీలలో జగిత్యాల జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించింది. జగిత్యాల జిల్లా తరపున పోటీలలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల విద్యార్థులు ముగ్గురు నవీన్, అభిలాష్ మరియు మిథున్ రాజ్ లను నేడు గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి,ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,కార్యనిర్వాహనాధికారి నారాయణ, గ్రామ పాలనాధికారి నాగరాణి, వార్డ్ సభ్యులు కుమార్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి లో ఖో ఖో పోటీలలో తృతీయ స్థానం సాధించిన మన జిల్లా జగిత్యాల జట్టులో ముగ్గురు విద్యార్థులు మన పాఠశాల నుండి ఉండడం మన గ్రామానికే గర్వకారణమని తెలిపారు. భవిష్యత్ లో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని, క్రీడాకారులకు అన్ని విధాల సహకరిస్తామని ఆయన తెలిపారు .ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తృతీయ స్థానం సాధించిన జట్టు కాంస్య పతకం, ప్రశంస పత్రం తో పాటు జట్టు సభ్యులందరికి కలిపి 50000/- నగదు బహుమతి అందుకున్నారని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## హోళీ పండుగ ఈ జాగ్రత్తలు తప్పనిసరి..మరి

**గాంధీ ఆసుపత్రి కంటి విభాగం హెచ్ఓడీ డా. రవిశేఖర్ రావు సూచనలు**



**సికింద్రాబాద్,మార్చి 02 ( ప్రజామంంటలు):**రంగుల పండుగ హోళీ అంటే చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ ఆనందంగా జరుపుకునే వేడుక. పరస్పరం రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపే ఈ పండుగలో ఆరోగ్య పరంగా నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి కంటి విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డా. రవిశేఖర్ రావు సోమవారం మాట్లాడుతూ...హోళీ వేడుకల్లో రసాయనిక రంగులను ఉపయోగించవద్దని సూచించారు. చర్మం, కళ్లకు హాని కలగకుండా సహజసిద్ధమైన రంగులను మాత్రమే వాడాలని తెలిపారు. రంగులు ఆడేటప్పుడు కంటి అద్దాలు ధరించడం మంచిదని, దీని వల్ల రంగులు నేరుగా కళ్లలోకి వెళ్లే ప్రమాదం తగ్గుతుందన్నారు. అనుకోకుండా రంగులు కంటిలో పడితే కళ్లను రుద్దకూడదని, వెంటనే శుభ్రమైన నీటితో బాగా కడగాలని చెప్పారు. కళ్లలో ఎర్రబారడం, మంట, వెలుగు చూడటంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే లూబ్రికేటింగ్ డ్రాప్స్ లేదా ఆయింట్‌మెంట్ వాడి, అవసరమైతే కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. హోళీ సందర్భంగా రంగులు చల్లే గొట్టాలు లేదా ఇతర వస్తువులు కంటికి, ముఖానికి దెబ్బతగిలితే వెంటనే కంటిపై ఒత్తిడి చేయకుండా సాదాసీదా బ్యాండేజ్ వేసి సమీప కంటి ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అలాగే చర్మ సమస్యలు రాకుండా పూర్తి శరీరాన్ని కప్పేలా దుస్తులు ధరించడం మంచిదని తెలిపారు. ఆనందంగా హోళీ జరుపుకోవాలంటే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అని డా. రవిశేఖర్ రావు పేర్కొన్నారు.

## జగిత్యాల జిల్లా ట్రెజరీ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన

**ఎస్. మధు కుమార్**



**జగిత్యాల మార్చి 2 ( ప్రజా మంటలు) :**జిల్లా ట్రెజరీ అధికారి గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరిచిన ఎస్. మధు కుమార్ ని టిఎన్జీఓ జిల్లా అధ్యక్షులు ఉద్యోగ జేఏసీ చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్ప గుచ్ఛం అందించి శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా టిఎన్జీఓ జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి ఉద్యోగఉపాధ్యాయ పెన్షనర్ల ప్రయోజనాలకు సంబందించిన వివిధ అంశాలపై చర్చించారు. జిల్లా ట్రెజరీ అధికారి మధు కుమార్ మాట్లాడుతూ ఉద్యోగఉపాధ్యాయ పెన్షనర్ల ప్రయోజనాల కు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించే విషయంలో తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టిఓ లు లావణ్య, గణేష్, శ్రీనివాస్, టిఎన్జీఓ జిల్లా కోశాధికారి సాహెద్ బాబు, జిల్లా నాయకులు రవి కుమార్, రాజేందర్, సుగుణాకర్, ప్రమోద్, హరి ప్రసాద్, ప్రమోద్ కుమార్, చందు, శ్రీనివాస్, పెన్షనర్ల సంఘం నాయకులు రఘుపతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే

**గ్రీవెన్స్ డే లక్ష్యం**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**జగిత్యాల మార్చి 2 (ప్రజా మంటలు) :**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశంప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే గ్రీవెన్స్ డే లక్ష్యమని జిల్లా ఎస్పీ అన్నారుగ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

## రంజాన్ సందర్భంగా వితంతులు, పేదలకు

**దుస్తులు, నగదు పంపిణీ**



**సికింద్రాబాద్, మార్చి 02 ( ప్రజామంటలు ):**పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని దివంగత సిటీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ జహంగీర్ వారాసిగూడ నివాసంలో ఆయన జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వితంతువులు, పేద కుటుంబాలకు కొత్త దుస్తులు,నగదు సహాయం పంపిణీ చేశారు. సహాయం పొందిన వారు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహ్మద్ అజ్గర్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల మార్చి 2 ( ప్రజా మంటలు):**మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూమాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి నిష్పక్షపాతంగా వ్యవహరించిన గొప్ప ప్రజానాయకుడని తెలిపారు. స్పీకర్ హోదాలో ఆయన చూపిన క్రమశిక్షణ, పారదర్శకత మరియు నైతిక విలువలు ప్రజాప్రతినిధులకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా ఆయన చిరస్మరణీయులని అన్నారు. ఈతరం యువత ఆయన సేవాభావం, నాయకత్వ లక్షణాలు మరియు ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నాయకుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు.మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినవారమవుతామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, జెడ్పి సి ఈ వో గౌతమ్ రెడ్డి, డి.ఆర్.డి.వో రఘువరన్, ఎస్సి సంక్షేమ శాఖ అధికారి కె. రాజ్ కుమార్, బి సి వెల్ఫేర్ అధికారి సునీత, డి.సి.వో మనోజ్ కుమార్, డి ఈ వో కె. రాము, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి రవి కుమార్, డి.పి.ఆర్.వో పి. నరేష్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ స్థాయిల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## హోలీ వేడుకల్లో సహజ సిద్ధమైన రంగులు మాత్రమే వాడాలి

**మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్**



**గొల్లపల్లి మార్చ్ 02ప్రజా మంటలు :** హోళీ వేడుకల్లో రసాయనిక రంగులను ఉపయోగించవద్దని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, మాట్లాడుతూ చర్మం, కళ్లకు హాని కలగకుండా సహజసిద్ధమైన రంగులను మాత్రమే వాడాలని తెలిపారు. రంగులు ఆడేటప్పుడు కంటి అద్దాలు ధరించడం మంచిదని, దీని వల్ల రంగులు నేరుగా కళ్లలోకి వెళ్లే ప్రమాదం తగ్గుతుందన్నారు. అనుకోకుండా రంగులు కంటిలో పడితే కళ్లను రుద్దకూడదని, వెంటనే శుభ్రమైన నీటితో బాగా కడగాలని చెప్పారు. కళ్లలో ఎర్రబారడం, మంట, వెలుగు చూడటంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే లూబ్రికేటింగ్ డ్రాప్స్ లేదా ఆయింట్‌మెంట్ వాడి, అవసరమైతే కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. హోళీ సందర్భంగా రంగులు చల్లే గొట్టాలు లేదా ఇతర వస్తువులు కంటికి, ముఖానికి దెబ్బతగిలితే వెంటనే కంటిపై ఒత్తిడి చేయకుండా సాదాసీదా బ్యాండేజ్ వేసి సమీప కంటి ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. అలాగే చర్మ సమస్యలు రాకుండా పూర్తి శరీరాన్ని కప్పేలా దుస్తులు ధరించడం మంచిదని తెలిపారు. ఆనందంగా హోళీ జరుపుకోవాలని మండల ప్రజలకు డాక్టర్, శ్రీకాంత్ శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామీణ క్రీడాకారులు ఆటల పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్ ఈ ఓ మనీల**



**హుస్నాబాద్, మార్చి 2( ప్రజా మంటలు ) :**పీఎం సంసద్ క్రీడామహోత్సవంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం లో హుస్నాబాద్ మిని స్టేడియంలో ఆటల పోటీలను ప్రారంభించిన ఎమ్ ఈ ఓ మనీల ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రేరణతో గ్రామస్థాయిలోని క్రీడాకారుల ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు కావున క్రీడాకారులందరూ కూడా దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నిర్వహకులు దుర్శెట్టిసంపత్, మాచర్ల కుమారస్వామి, బొమ్మగాని సతీష్, దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షులు సంపత్ నాయక్, జలగం రమేష్, శ్రీరామోజు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సంతోష్, శ్రీనివాస్, శ్రీకాంత్ రాయికుంట చందు,తగరం లక్ష్మణ్, బోడిగే వెంకటేష్, ఇల్లందుల తిరుపతి,బొల్లిశెట్టి సురేష్ ఎర్రోజు సాయికృష్ణ, గౌరవేణి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ మార్చి 2( ప్రజా మంటలు) :**రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి పొన్నం ప్రభాకర్ పండుగ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ మన సంస్కృతిలో స్నేహం, సౌహార్దం, ఆనందానికి ప్రతీక. రంగులలా మన జీవితాలు సంతోషాలతో నిండాలని, ప్రతి ఇంట్లో ఐక్యత, శాంతి, సుఖసమృద్ధులు నెలకొనాలని ఆకాంక్షించారు.మన రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ఈ సందర్భంలో, అందరం కలిసికట్టుగా సామరస్యంతో ముందుకు సాగుదామని ,ద్వేషాలకు తావులేకుండా ప్రేమ, పరస్పర గౌరవంతో సమాజాన్ని మరింత బలపరచుదామని పిలునిచ్చారు. సహజసిద్ధమైన రంగులు , సంప్రదాయ పద్ధతిలో హోలీ పండుగ జరుపుకోవాలని సూచించారు.హోలీ పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త ఆశలు, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## దండేపల్లి గ్రామంలో రెండవ అంగన్వాడి సెంటర్

**భవన నిర్మాణానికి భూమి పూజ**



**ఎల్కతుర్తి మార్చి 2 ప్రజా మంటలు :**ఎల్కతుర్తి మండల కేంద్రంలోని దండేపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల భాగంగా రెండవ సెంటర్ భవన నిర్మాణానికి సోమవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గోలిపెల్లి సంపత్ అధ్యక్షత వహించి భూమి పూజ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి దిశగా ఈ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్కతుర్తి ఏ ఎం చైర్మన్ సూకినే మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లేటి ఇంద్రసేనారెడ్డి, బావు పెట్ సర్పంచ్ బత్తిని రవీందర్ ఉప సర్పంచ్ శనిగరపు సందీప్ ప్రజా నిర్మాణ శాఖ ఏఈ ఉమామహేశ్వర్ పంచాయతీ కార్యదర్శి తాళ్లపల్లి అఖిల హాజరయ్యారు. అలాగే దండేపల్లి గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలోని చిన్నారుల అభ్యాసం పోషకాహార సదుపాయాల మెరుగుదలకు ఈ అంగన్వాడి భవనం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

## కల్లు గీత కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేషియా మంజూరు

**బీసీ కులాల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది...**

**-- మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్**



**చిగురుమామిడి మార్చి 02 (ప్రజా మంటలు):**కాంగ్రెస్ ప్రభుత్వం వెనుక బడిన కులాల అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం ప్రాధాన్యతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధి కోసం పాటు పడుతోందని మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ మాట్లాడుతూ చిగురుమామిడి మండల కేంద్రములో గతములో తాటి చెట్టుపై నుండి ప్రమాదవాశత్తు కింద పడి అంగవైకల్యం పొందిన కల్లు గీత కార్మికుడు బూరుగు సంజీవ్ గౌడ్ కు ఎక్సయిజ్ శాఖ నుండి 5లక్షల రూపాయలు ఎక్సగ్రేషియా అందాయన్నారు. మత్సకార్మిలకు, గీత కార్మికులు వృత్తిలో ప్రమాదవాశత్తు శాశ్వత అంగ వైకల్యం పొందిన, మరణించిన నష్ట పరిహారాన్ని 5 లక్షలకు పెంచి బాధిత కుంటుంబాలను ఆదుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెనుక బడికి కులాల ఆర్థికాభివృద్ధికి చేయూత నిస్తుందని, గీత కార్మికులకు 40 వేలు సేఫుటీ మోకులు అందజేశారని, ఎక్సగ్రేషియా బకాయిలు 3 కోట్ల 2 లక్షలు విడుదల చేశారన్నారు. త్వరలోనే నేత, గీత కార్మికులకు పెన్షన్లు కూడా మంజూరు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, కేజీకేఎస్ జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు పోతర్ల శివాంజనేయులు, గీత కార్మిక సంఘ నాయకులు బండారుపెల్లి రాజు గౌడ్, కక్కెర్ల సంపత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దోమ శ్రీనివాస్ రెడ్డి, పోటు మల్లారెడ్డి, దూలమిట్ట నర్సింహా రెడ్డి, ముద్రవేణి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణతో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలి

**జగిత్యాల ఆర్డీవో మధుసూదన్**



**జగిత్యాల, మార్చి 2(. ప్రజా మంటలు) :** వాల్మీకి ఆవాసం సేవా భారతి ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణ ను ఉపయోగించుకుని ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవాలని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ గౌడ్ అన్నారు. వాల్మీకి ఆవాసం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, కంప్యూటర్ శిక్షణ కేంద్రం లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం వాల్మీకి ఆవాసం లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ సేవా భారతి ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గత 33 సంవత్సరాలుగా నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కంప్యూటర్, కుట్టు మిషన్, అగ్ని వీర్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ ప్రాంత సేవా ప్రముఖ శివశంకర్ మాట్లాడుతూ సేవా భారతి దేశవ్యాప్తంగా సుమారు రెండు లక్షల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. సమాజానికి ఏది అవసరమో దానిని పూర్తి చేసేందుకు సేవా భారతి నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. దేశంలోని ప్రజలంతా తమ సోదరులే అనే భావనతో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపి శక్తివంతమైన సమాజ నిర్మాణం కోసం సేవా భారతి చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ యాద రామకృష్ణ,వాల్మీకి ఆవాస అధ్యక్షులు జడిగే పురుషోత్తం, సేవా భారతి జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, రాజ్ మనోహర్ రెడ్డి,ఆవాస కమిటీ సభ్యులు సంపూర్ణ చారి, మధుకర్,మల్లేశం, శ్రీనివాస్, కైలాసం, అశోక్ రావు, డాక్టర్ ధనుంజయ, బొమ్మర సత్యనారాయణ, మల్లేశం, చంద్రశేఖర్, కవిత, స్వప్న, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిల ప్రాణాలతో చెలగాటమాడుతున్న

**వార్డెన్ ను విధుల నుంచి తొలగించాలి**

**యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్**



**భీమదేవరపల్లి, మార్చి 2 (ప్రజా మంటలు) :** మండలంలోని ముల్కనూరు ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం రాత్రి విద్యార్థినిలు విద్యుత్తు మోటారు నీటి కోసం కరెంటు ఫ్యూజులు పెట్టడాన్ని జిల్లా అధ్యక్షులు ఆకుల మనోజ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ, ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆదివారం రాత్రి విద్యార్థినిలు నేరుగా వెళ్లి విద్యుత్ మోటారు నీటి కోసం నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతూ వారే స్వయంగా ఫ్యూజులు పెట్టి నీటి సౌకర్యాన్ని వినియోగించు కోవడం రోజువారి దినచర్యగా చేస్తున్నారని అన్నారు. హాస్టల్లో విద్యార్థినిల చేత పని చేపించడం అదేవిధంగా స్వయంగా విద్యార్థినిలు వారి ప్రాణాలను లెక్కచేయకుండా వెళ్లడం దురదృష్టకరమని అన్నారు. రాత్రిపూట కనీసం వాచ్మెన్, సంబంధిత ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ చేయవలసిన పనిని విద్యార్థినిలు చేయడం ఏమిటని మండిపడ్డారు. సంబంధిత వార్డెన్ సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా రావడం విధినిర్వహణ లోపం కనబడుతుందని అన్నారు. విద్యార్థులు ఉదయం పూట టిఫిన్ చేసే సమయంలో కూడా వార్డెన్ ఉండడం లేదని అదేవిధంగా విద్యార్థులకి ఏమైనా అనుకోని సంఘటనలు జరిగితే ఆ కడుపు కోత ఎవరికి ఉంటుందని, వార్డెన్ విద్యార్థులు చేత పనిచేయడం దురదృష్టకరమని ఇలాంటి పనులు చేపించిన వార్డెన్ ను విధుల నుంచి తొలగించాలని అదే విధంగా మరెప్పుడూ పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు. బాధ్యులైన వార్డెన్ ను వెంటనే విధుల నుంచి తొలగించాలని లేనియెడల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తామని తెలిపారు.

## పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్వర్గీయ శ్రీపాదరావు జయంతి వేడుకలు



**జగిత్యాల మార్చి 2 ( ప్రజా మంటలు) :**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీ దుద్దిల్ల శ్రీపాద రావు జయంతిని జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాద రావు చిత్రపటానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మరియు పోలీస్ అదికారులు పూలమాలవేసి నివాళులర్పించారు. నైతిక విలువలు, ప్రజల పట్ల అంకితభావం కలిగిన ప్రజానాయకుడిగా ఆయన గుర్తింపుపొందారని ఈ సందర్భం గా అసెంబ్లీ స్పీకర్ గా వ్యవహరించిన ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ యొక్క కార్యక్రమంలో ఎస్ బి డిఎస్పి వెంకటరమణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు కిరణ్ కుమార్, వేణు, సైదులు, ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్, రవీందర్, శ్రీధర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com